కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుక

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వేడుకలను ప్రారంభించారు. ఆయా శాఖల మహిళా అధికారులు, ఉద్యోగినులు, సిబ్బంది రంగురంగుల పువ్వులతో బతుకమ్మను తయారు చేశారు. అనంతరం ఆడిపాడారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కుటుంబాల వివరాలు పక్కాగా సేకరించండి

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వేలో కుటుంబాల వివరాలు పక్కాగా సేకరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. వేములవాడ గ్రామీణ మండల బొల్లారంలో సర్వేను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివరాల నమోదు తీరు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జనన, మరణ వివరాలు పక్కాగా నమోదు చేయాలని.. కుటుంబ సభ్యుల ఫొటోలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చిన్ని తెర.. పెద్ద సందేశం


న్యూస్‌టుడే, మేడిపల్లి

సృజనాత్మకత ఉండి సినిమాలు తీయడం సాధ్యం కాని వారికి యూట్యూబ్ ఒక అవకాశంగా మారింది.. యువత దర్శకులుగా, నిర్మాతలుగా, ఫొటోగ్రఫీ తదితర సాంకేతిక రంగాల్లో తమదైన ముద్ర వేయడానికి తోడ్పడుతోంది.. ఎక్కువ మంది యూట్యూబ్‌ను ఆదాయ మార్గంగా మలచుకుంటుండగా కొందరు మాత్రం సామాజిక అంశాలను స్పృశిస్తూ లఘుచిత్రాలు నిర్మిస్తున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, బాలికలపై వేధింపులు, ట్రాఫిక్ నిబంధనల అమలుపై అవగాహన కల్పిస్తూ లఘు చిత్రాలు నిర్మిస్తూ అవార్డులు కూడా సొంతం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇలా విభిన్న అంశాలను చిత్రాలుగా మలచి సామాజిక బాధ్యత చూపుతున్న వారిపై కథనం...

స్ఫూర్తిదాయక లఘు చిత్రాల రూపకల్పన

ఆదివారం ప్రత్యేకం

మతమా.. మానవత్వమా





లఘుచిత్రం : మతమా... మానవత్వమా

నిర్మాత, దర్శకుడు : దామెర శంకర్ స్వస్థలం : గోదావరిఖని

అవార్డు : వీకేఆర్, ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేం మీడియా రాష్ట్రస్థాయి అవార్డు

కథాంశం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ హిందువును క్రిస్టియన్, ముస్లిం, హిందూ మతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఆసుపత్రిలో చేర్పించి రక్తదానం చేస్తారు. కోలుకుంటున్న వ్యక్తిని తమ మతంలో చేర్చుకుంటామంటూ ముస్లిం, క్రిస్టియన్ వ్యక్తులు అంటుంటే గాయపడిన వ్యక్తి మీరిచ్చిన రక్తం తనకు వద్దంటూ చేయి కోసుకుంటాడు. అక్కడే ఉన్న వైద్యుడు మతం కంటే మానవత్వమే గొప్పదంటూ చేసిన హితబోధతో లఘు చిత్రం ముగుస్తుంది.



మధ్య తరగతి జీవితాలకు నిలువుటద్దం

దర్శకుడు : అనసూరి భూనాథా చారి

స్వస్థలం : బెజ్జంకి మండలం తోటపల్లి

ప్రస్తుతం : కరీంనగర్



లఘుచిత్రాలు : రాజవ్వ, పల్లవి, మనిషి

కథాంశాలు : భర్త తాగుడుకు బానిసైనా, తను నిరాదరణకు గురయినా నిలదొక్కుకునే అంశంతో రాజవ్వను తెరకెక్కించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చాలా మంది బాలికలను ప్రోత్సహించాల్సింది పోయి వారిని సూటిపోటి మాటలతో వేధించే వారే ఎక్కువ. ప్రభుత్వ పాఠశాలలో చదివే ఓ బాలిక తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుంటే మధ్యాహ్న భోజనం సమయంలో ఇచ్చే గుడ్డు తీసుకుని ఇంటికి వెళ్తుంది. తోటి పిల్లలు గుడ్డు దొంగతనం చేస్తోందంటూ బాలికపై ఫిర్యాదు చేస్తారు. ప్రిన్సిపల్ బాలిక వెనకే వెళ్లి చూడగా పేదరికంతో మగ్గుతున్న తన తల్లికి క్యాన్సర్ ఉన్నందున గుడ్డు తినిపిస్తుందని తెలిసి చిన్నారిని ప్రోత్సహించిన అంశంతో పల్లవి అనే లఘు చిత్రాన్ని తీశారు. మనిషి పశువైతే అనే లఘుచిత్రంలో మానవత్వం లేని క్రూరుడిని ధైర్యం కూడబలుక్కుని చంపేసే చిన్నారుల కథతో లఘు చిత్రం తెరకెక్కించారు.

మత్తు వదలాలని..

దర్శకుడు : శివకృష్ణ బుర్రా

నిర్మాణం : మై విలేజ్ షో

స్వస్థలం : లంబాడిపల్లి, మల్యాల మండలం

లఘు చిత్రం : రేవ్‌పార్టీ





కథాంశం : గంజాయికి అలవాటుపడిన యువకులు కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురి చేస్తుంటారు. పోలీసులు నిఘా వేసి రేవ్ పార్టీ ఏర్పాటు చేసి యువకులను ఆ పార్టీకి రప్పించి అరెస్టు చేస్తారు. గంజాయి సరఫరా సహా డీలర్లపై నిఘా పెంచుతారు. మత్తుకు బానిసైన యువకులను రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపి మామూలు యువకులుగా మారుస్తారు.

సామాజిక అంశాలే ఇతివృత్తంగా..



వన్ డే ఫర్ సీనియర్ సిటిజన్స్



రామ్ మొగిలోజి

దర్శకుడు: రామ్ మొగిలోజి స్వస్థలం : గంగాధర మండలం కాసారం

ప్రస్తుత నివాసం : కరీంనగర్

లఘుచిత్రాలు : వృద్ధుల హక్కుల పరిరక్షణ, స్త్రీ స్వేచ్ఛ, అంకితం, డయల్ 100, గంజాయి డౌన్‌డౌన్

■ ఒడిశాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గంజాయి డౌన్‌డౌన్ లఘుచిత్ర దర్శకుడు రామ్ మొగిలోజి బెస్ట్ డైరెక్టర్‌గా నామినేట్ అయ్యారు. అక్టోబరు 17న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

కథాంశాలు : నిత్య జీవితంలో వివిధ ప్రదేశాల్లో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకూ హక్కులు ఉంటాయనే వివరణతో చిత్రం తీశారు. స్త్రీ స్వేచ్ఛ అనే చిత్రంలో స్త్రీ అంటే భారం కాదు ఆస్తిగా భావించే రోజులొచ్చాయనే అంశాన్ని స్పృశించారు. భార్య, కుమారుడితో ఉంటున్న కానిస్టేబుల్ విధి నిర్వహణకే అంకితమై కుటుంబానికి సమయం ఇవ్వలేక... ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంశాన్ని అంకితం ద్వారా వివరించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై తన కూతురుకు తీవ్ర జ్వరం వచ్చినా ఫోన్‌కూ స్పందించకపోవడంతో అక్కయ్యతో కలసి ఆసుపత్రికి వెళ్తుంటే ఆకతాయిల నుంచి ప్రమాదంలో పడే సమయంలో తనను తాను రక్షించుకునే కథను డయల్ 100లో చూపారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తే గంజాయి బారిన పడిన చిన్నారి కథాంశంతో గంజాయి డౌన్ డౌన్ అనే లఘుచిత్రం తీశారు.

గంటపాటు.. ఏకధాటి వర్షం



జలమయమైన రాజన్న ఆలయ ప్రధాన రహదారి

వేములవాడ పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి రాజన్న ఆలయ ప్రాంతంలోని ప్రధాన రహదారులతోపాటు వీధుల్లో పెద్దఎత్తున వరద ప్రవహించింది. గంట తరువాత వర్షం తగ్గిపోయి మళ్లీ ఎండ రావడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. పత్తి పంటకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతుల్లో సంతోషం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, వేములవాడ

ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తుల బదిలీ

జగిత్యాల, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఆరుగురు జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు జరగ్గా వారిస్థానాల్లో వివిధ ప్రాంతాల నుంచి కొత్త వారిని నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్‌ను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సికింద్రాబాద్ జ్యుడిషియల్ అకాడమి ఏవోగా ఉన్న కె.వెంకటమల్లిక్ సుబ్రమణ్యశర్మ జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కె.రాణిని కరీంనగర్ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్‌ను అక్కడే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారిని రాజన్నసిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. వేర్వేల సీనియర్ సివిల్ జడ్జి పి.వి.కిరణ్ కుమార్‌ను హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. పాపన్నపేట జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్‌ను గోదావరి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావును మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. గోదావరిఖని సీనియర్ సివిల్ భృంగి శ్రీనివాస్‌ను పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అక్కడి కె.స్వరూపరాణిని పెద్దపల్లి న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు.

సిరికొండలో అక్రమ కట్టడం కూల్చివేత

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని సిరికొండలో అక్రమంగా నిర్మించిన ఇల్లును, ప్రహరీని శనివారం అధికారులు కూల్చివేశారు. 107 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అంజయ్య ఈ నిర్మాణాలు చేపట్టగా ఆయనకు గత నెలలో నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ ఫారూఖ్ తెలిపారు. నోటీసుకు సరైన సమాధానం రాకపోవడంతో కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌ఐలు షఫీ, సింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.



అధికారులు కూల్చిన ఇల్లు

నూలు డిపోతో నేతన్నలకు లబ్ధి

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ కేంద్రంగా యార్న్ (నూలు) డిపోను ప్రభుత్వం జీవో నంబర్ 18 ద్వారా ఏర్పాటు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. డిపో ఏర్పాటుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 40 వేల మరమగ్గాలపై పని చేసే 30 వేల మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. పెట్టుబడిదారులపై ఆధారపడకుండా నేతన్నలకు నేరుగా ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. యార్న్ డిపోనకు రూ. 50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు.

రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివార్లు అశ్వవాహనంపై విహరించారు. నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీపార్వతీ, రాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు అందంగా అలంకరించిన పెద్ద సేవపై ప్రతిష్ఠించి వేద మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లు అంతరాలయంలో విహరించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



అశ్వవాహనంపై స్వామివార్లు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

చెత్త సేకరణ సరే..

సేంద్రియ ఎరువు ఏది?

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు



న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా డంపింగ్ యార్డు, కంపోస్ట్ షెడ్లను నిర్మించింది. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరోవైపు పంచాయతీలకు ఆదాయం సమకూరడం లేదు.

జిల్లాలో 255 కంపోస్టు షెడ్లు ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఒక్కో గ్రామ పంచాయతీలో రూ. 2.50 లక్షల వ్యయంతో వీటిని నిర్మించారు.


- చెత్తను తరలించడానికి ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టరును కొనుగోలు చేశారు.
- రోజూ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేయాలి.
- ఎరువును హరితహారం మొక్కలకు వినియోగించాలని భావించారు. మిగిలిన ఎరువును రైతులకు కిలో రూ. 10 చొప్పున విక్రయించి వచ్చిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉంది. అయితే ఆచరణలో మాత్రం ఇది అమలు కావడం లేదు.

■ పర్యవేక్షణ లోపంతో...

చెత్తను క్రమ పద్ధతిలో సేకరించాలని గ్రామ పంచాయతీ నుంచి ఇంటింటికీ రెండు బుట్టలు పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వీటిలో వేర్వేరుగా వేయాలి.

- వీధుల్లోకి వచ్చే చెత్త సేకరణ వాహనాలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాల్సి ఉంది.
- షెడ్డులో కాయగూరలు, ఆకుకూరల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు తడి చెత్తగా వేరు చేయాలి.
- ప్లాస్టిక్, అట్ట ముక్కలు తదితర వాటిని పొడి చెత్తగా వేరు చేయాలి. వీటిని విభాగాల వారీగా కేటాయించి అలా వేరు చేసిన వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలి.
- అధికారుల పర్యవేక్షణ లోపంతో మెజార్టీ పంచాయతీల్లో అమలు కావడం లేదు.
- పలు గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం లేదు. గ్రామాల్లో రోడ్ల వెంట, గ్రామ శివార్లలో దర్శనమిస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డుల నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టడంతోపాటు సేంద్రియ ఎరువు తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

■ నిర్లక్ష్యానికి నిదర్శనం



కంపోస్టు షెడ్లను ఉపయోగించకుండా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. కంపోస్టు షెడ్లను వినియోగించి సేంద్రియ ఎరువును తయారు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎరువును కొనుగోలు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నా గ్రామ పంచాయతీలు దానిపై దృష్టి సారించడం లేదు. - *కిరణ్, ఎదురుగట్ల*



శివారులో చెత్త

■ ఎరువు తయారీకి ఆదేశిస్తాం



గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేసే విధంగా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశిస్తాం. ఇప్పటి వరకు జిల్లాలో 408 క్వింటాళ్ల ఎరువును గ్రామ పంచాయతీలు తయారు చేశాయి. ఇందులో 150 క్వింటాళ్లు హరితహారం మొక్కలకు అందించారు. 258 క్వింటాళ్లను రైతులకు విక్రయించగా రూ.1.60 లక్షల ఆదాయం సమకూరింది. పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచిస్తాం. - *శేషాద్రి, ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారి*

సాగులో సలహాలు అందేదెలా..?

- వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత
- క్షేత్రస్థాయిలో తప్పని ఇబ్బందులు

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

వ్యవసాయశాఖను అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల బదిలీల్లో ఇక్కడ పనిచేసిన వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఆయా పోస్టుల్లో ఖాళీలేర్పడ్డాయి. ప్రధానంగా మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారుల కొరత నెలకొంది. ఒక్కో ఏవో రెండు నుంచి మూడు మండలాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ విస్తరణాధికారులదీ అదే పరిస్థితి.

13 మండలాలు.. ఆరుగురు ఏవోలు

- జిల్లాలో 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణం ఉండగా.. 2,90,380 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉంది.
- రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు.
- ఈ ఏడాది వరి 1,80,310 ఎకరాలు, పత్తి 49,332 ఎకరాలు, మొక్కజొన్న 56.26 ఎకరాలు, పెసర 439.8 ఎకరాలు, కంది 162.05 ఎకరాలతోపాటు ఇతర పంటలను రైతులు సాగుచేశారు.
- జిల్లాలో 13 మండలాలకు ప్రస్తుతానికి ఆరుగురు మండల వ్యవసాయాధికారులు మాత్రమే ఉన్నారు.
- సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డి పేట, వేములవాడ, బోయినపల్లి, చందుర్తి మండలాల్లో ఏవోలు పనిచేస్తుండగా మిగితా మండలాల్లో ఏవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- రైతులకు సత్వర సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతి 5 వేల మంది రైతులకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 57 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో ఒక వ్యవసాయ విస్తరణాధికారి సేవలందించాల్సి ఉంటుంది.
- మొత్తం 57 ఏఈవో పోస్టులకు 49 మంది పని చేస్తున్నారు. వీరిలోనూ 10 మంది పొరుగు సేవలపై విధులు నిర్వరిస్తున్నవారే కావడం గమనార్హం.
- ఇద్దరు ఏఈవోలు ప్రస్తుతానికి సెలవులో ఉన్నారు.
- రుద్రంగి, గంభీరావుపేట, ఆవునూరు, వీర్నపల్లి, అల్మాస్‌పూర్, రాచర్ల గొల్లపల్లి క్లస్టర్ల పరిధిలో ఏఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కృష్ణవేణి, మహేశ్వరి ఏవో (సాంకేతిక)లుగా పనిచేస్తుండగా మరో ఏవో టెక్నికల్ పోస్టుతోపాటు ఒక సీనియర్ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉన్నాయి.



వరిపంటను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డిపేట ఏవో కవిత

పెరుగుతున్న భారం

ఏవోలు ఫర్టిలైజర్, ఎరువులు, విత్తనాల దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఎలాంటి కల్తీ జరగకుండా నమూనాలను ప్రయోగశాలకు పంపించాలి. కొత్త వంగడాలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ పంట యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు అందించాలి. ఏఈవోలను పర్యవేక్షించాలి. ఉన్నతాధికారులతో సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లలో పాల్గొని క్షేత్రస్థాయిలో ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లాలి. ఏఈవోలు రైతులు వేసిన పంటల వివరాలను నమోదు చేయాలి. రుణమాఫీ, రైతు బీమా, రైతుబంధు పథకాల్లో రైతుల వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికలు సమర్పించాలి. రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో మెలకువలపై అవగాహన కల్పించడంతోపాటు ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ఉద్యోగ కర్తవ్యాన్ని నెరవేర్చాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఏవోలు, ఏఈవోల పోస్టుల ఖాళీలతో పలు మండలాల్లో ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో అధికారులపై పని ఒత్తిడిభారం పడుతోంది. అధికారులు, సిబ్బంది కేటాయింపులో జిల్లాకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం తెలిపారు.

వేతనాలు చెల్లించాలని నిరసన

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని.. వెంటనే ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి కార్మికులకు వేతనాలు సక్రమంగా అందడం లేదన్నారు. దసరా పండగ వస్తున్నందున పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, రూ.26 వేల వేతనం అమలుతోపాటు రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని.. కారోబార్లకు ప్రత్యేక స్టేటస్, వేతనాల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు వర్కోలు మల్లయ్య, అక్కల అంజయ్య, సందెల మహేశ్, న్యాత నర్సయ్య, రవీందర్, రాజశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు



మానేరు నుంచి లక్ష్మిని బయటకు తీసుకొస్తున్న పోలీసులు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి లక్ష్మి (51) కుటుంబ కలహాలతో శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకోవడానికి మానేరు వాగులో దూకింది. అదేసమయంలో అటువైపు వెళ్తున్న డిస్ట్రిక్ట్ గార్డ్ కానిస్టేబుల్ దేవరాజు, సిరిసిల్ల పట్టణ పోలీసులు వెంటనే స్పందించారు. దేవరాజు వెంటనే వాగులోకి దూకి మహిళను బయటకు తీసుకొచ్చారు. సిరిసిల్ల పట్టణ ఠాణాకు తీసుకెళ్లి లక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ దేవరాజును, సిరిసిల్ల పట్టణ పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, వీర్నపల్లి

? వీర్నపల్లి మండల కేంద్రంలో కోతులు, శునకాల బెడద ఎక్కువైంది. వానరాలు ఇంట్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకుపోతున్నాయి. కుక్కలు వీధుల్లో గుంపులుగా చేరి దాడులకు దిగుతున్నాయి.
- మల్లారపు రాజం, వీర్నపల్లి

✔ కలెక్టర్ ఆదేశాల మేరకు వాటికి తగిన శస్త్రచికిత్సలు చేయిస్తాం.
- తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, వీర్నపల్లి

న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం

? వట్టెంల గ్రామంలో మురుగు కాలువల నుంచి తీసిన వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. - అనిల్, స్థానికుడు

✔ వ్యర్థాలను తొలగింపజేసి సమస్యను పరిష్కరిస్తాం.
- నాగరాజు, గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రుద్రంగిలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు రుద్రంగి సెస్ ఏఈ కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: గోవాలోని మాపుసా స్టేడియంలో జరిగిన ఓపెన్ తైక్వాండో అంతర్జాతీయ పోటీల్లో ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్‌కు చెందిన లింగంపల్లి శ్రీకాంత్ ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో భారత్‌తోపాటు మలేషియా, ఇండోనేషియా, నేపాల్, శ్రీలంక దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా.. కురుగి 82 కేజీల విభాగంలో శ్రీకాంత్ బంగారు పతకం, పున్సే విభాగంలో రజత పతకం సాధించారు.


పతకాలతో శ్రీకాంత్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

వెంకటాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు కాయితి రోహిణి, గట్టిపెల్లి వంశిక రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రవికుమార్ శనివారం తెలిపారు. మెదక్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు తలపెట్టిన పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ఎంఈవో కృష్ణహరి, ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండీ మునీర్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎండీ షాబోద్దీన్ శనివారం తెలిపారు. విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ సుంకటి అజయ్‌కుమార్, ఆమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మంగ, ఎస్సై పిల్లి రామచంద్రంగౌడ్, గ్రామస్థులు అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


పరుగు పందెంలో పోలీసులు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ బెటాలియన్‌లో 17వ బెటాలియన్‌లో అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్, టీజీఎస్పీ బెటాలియన్ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. 17వ బెటాలియన్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసుల్లో మానసిక ఒత్తిడి తగ్గించడానికి ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో 250 మంది సిబ్బంది పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ (సివిల్) చంద్రశేఖర్, అసిస్టెంట్ కమాండర్లు సాంబశివరావు, రాందాసు, ఉదయ భాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమీల, ఆర్ఐలు నారాయణ, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ముస్తాబాద్: మోహినికుంటలో..


ఎల్లారెడ్డిపేటలో..


కోనరావుపేట: బాపుసాయిపేటలో..

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా విద్యుత్తు దీపాలతో అలంకరించిన మండపాల్లో పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఇల్లంతకుంట మండలం రేపాక, తాళ్లపల్లి, సోమారంపేట గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవ రాత్రుల కోసం పూజ సామగ్రికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రెం తిరుపతిరెడ్డి రూ.15 వేలు అందించారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం


రుద్రవరంలో..


బోయినపల్లి: మహిళల ప్రత్యేకపూజలు

భవన నిర్మాణ కార్మికులపై పట్టింపేదీ?

వీర్నపల్లి, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వాలకు పట్టింపు కరవైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం కార్మికులతో సమావేశమయ్యారు. కొత్తగా ఏర్పాటయిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత ప్రభుత్వాల విధానాన్ని అనుసరిస్తుందని మండిపడ్డారు. కార్మిక సంక్షేమ నిధి నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. వెంటనే కార్మిక వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాలకు బేషరతుగా పరిహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నరేందర్, శంకర్, అంజయ్య, వెంకటేష్, దేవయ్య, రాజం తదితరులు పాల్గొన్నారు.

తక్షణ చర్యలు అవసరం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీటి సరఫరాలో అంతరాయాలు ఉంటే ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తంగళ్లపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణ అన్నారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ మంచినీటి సరఫరా సహాయకులకు బోర్ మెకానిజం, తాగునీటి నాణ్యత పరీక్షలు, పైపులైన్ల లీకేజీలు అరికట్టడం, తాగునీటి నిర్వహణ, తదితర అంశాలపై తంగళ్లపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో నాలుగురోజుల పాటు శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగించుకున్న గ్రామ మంచినీటి సహాయకులకు శనివారం ధ్రువపత్రాలను ఎంపీడీవో అందజేసి మాట్లాడారు. మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రావ్య, పర్యవేక్షకులు రమేశ్, సీనియర్ సహాయకులు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రికి నివాళి


ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఎల్లారెడ్డిపేట: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి సందీప్‌కుమార్ ఝా నివాళి అర్పించారు. వెంకటస్వామి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొని నివాళి అర్పించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాందాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ డైరెక్టర్లు రాజేందర్, మెండే శ్రీనివాస్, రవీందర్, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, గంట చిన్నలక్ష్మి తదితరులు నివాళి అర్పించారు.

సద్వినియోగం చేసుకోండి

నామాపూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే రాయితీ బస్‌పాస్‌లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లను సిరిసిల్ల డిపో మేనేజర్ చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్‌పాస్‌ల్లో 50 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. దివ్యాంగులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచి తిరుపతి, కంట్రోలర్ రాంరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


నామాపూర్‌లో బస్‌పాస్‌లు అందజేస్తున్న డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు

విద్యుత్తు దీపాల అందజేత


పంచాయతీ కార్యదర్శి రమేశ్‌కు విద్యుత్తు దీపాలు అందజేస్తున్న మాజీ సర్పంచి శ్రీనివాస్

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలో బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ సర్పంచి ఉప్పుల శ్రీనివాస్ శనివారం రూ.15 వేల విలువ గల విద్యుత్తు దీపాలను పంచాయతీ కార్యదర్శి రమేశ్‌కు అందజేశారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం మాజీ సర్పంచి ఉదారత అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడా దుస్తులు..

కోనరావుపేట: వెంకట్రావుపేటలో కేపీఎల్ క్రికెట్ క్రీడాకారులకు శనివారం కోనరావుపేట పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అనుపాటి భూంరెడ్డి దుస్తులు అందజేశారు. యువత సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న నాయకులు

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీలో భారాస పట్టణశాఖ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ ఆధ్వర్యంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు, బాలయ్యగౌడ్, రమేశ్, హసన్, దర్వేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, పవన్‌గౌడ్, గోపి తదితరులు పాల్గొన్నారు.


రాజన్న ఆలయ ప్రాంగణంలో..


ఆలయ ధర్మగుండంలో బతుకమ్మల నిమజ్జనం


సిరిసిల్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

ఘనంగా బతుకమ్మ వేడుకలు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా మహిళలు బతుకమ్మలు పేర్చారు. అందరూ కలిసి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం


సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


రాచర్ల జూనియర్ కళాశాలలో..



రుద్రంగిలోని కృష్ణవేణి పాఠశాలలో..


మహతి మహిళా డిగ్రీ కళాశాలలో..

సంక్షిప్తం

కాటన్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి

సిరిసిల్ల (విద్యానగర్): కాటన్ పరిశ్రమను ఆదుకోవాలని కాటన్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక నాయకులు సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ ఏడి సాగర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి గాజుల రవి, తాటిపాముల దామోదర్, గౌడ రాజు, పిస్క మధు, గోపి, కోడం అశోక్, కట్టెకోల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభాల పరిశీలన

వీర్నపల్లి: విస్తరణ పనుల్లో రోడ్డు మధ్యలోకి వచ్చిన విద్యుత్తు స్తంభాలను సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులు సెస్ సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు మధ్యలో స్తంభాలను భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా వేయాలన్నారు. సెస్ డైరెక్టర్ మల్లేశం, ఏఈ రమేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాజాత బృందం ప్రదర్శన

రాగట్లపల్లి (ఎల్లారెడ్డిపేట): కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలోని కళాకారులు స్వచ్ఛదనంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని కంటికి రెప్పలా సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. శ్రీధర్‌రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్, పరశురాములు, గణేశ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు- నియామకాలు

వేములవాడ: బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన దండు వినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

బోయినపల్లి: బోయినపల్లి మండల మాల మహానాడు అధ్యక్షుడిగా రాకం రాజేష్, ఉపాధ్యక్షులుగా కాడె భాస్కర్, ఇడుగు నరేష్, కోశాధికారిగా దాసరి బాబు, సంయుక్త కార్యదర్శిగా నరేశ్, రవి, సాగర్, ప్రేమ్‌కుమార్, తదితరులను ఎన్నుకున్నారు.

పరామర్శ

ముస్తాబాద్: ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి తల్లి సత్తమ్మ (80) మొర్రాయిపల్లెలో గుండెపోటుతో శనివారం మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి, భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి నిత్యాన్నదాన సత్రానికి వేములవాడ పట్టణానికి చెందిన విశ్రాంత ఏఈవో పంపరి దేవయ్య శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి చెక్కును అందజేశారు.


ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న దేవయ్య కుటుంబ సభ్యులు

కుమారుడిపై బెంగ.. అధికారుల భరోసా

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: కుమారుడు కనిపించడం లేదని, ఎలాగైనా అతడిని చూడాలని పరితపిస్తున్న వృద్ధురాలి ఇంటికి అధికారులు శనివారం వెళ్లారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు తాళ్ల సత్తవ్వ ఒక్కగానొక్క కుమారుడు వెంకట్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం గ్రామాన్ని వదిలివెళ్లాడు. కూకట్‌పల్లిలోని ఓ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఫోన్ కొంత కాలంగా పనిచేయకపోవడంతో వృద్ధురాలు ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో తహసీల్దారు రాంచందర్ ఆదేశాల మేరకు ఆర్ఐ సంతోశ్, వృద్ధుల డేకేర్ సెంటర్ కో-ఆర్డినేటర్ మమత.. వృద్ధురాలి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న సత్తవ్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బంధువులకు సూచించారు. అవసరమైతే సత్తవ్వకు కేర్ టేకర్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆర్ఐ సంతోష్ పేర్కొన్నారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలరాజుయాదవ్ ఉన్నారు.


వివరాలు నమోదు చేస్తున్న ఆర్ఐ సంతోశ్

వారిపై చర్యలు తీసుకోండి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: పండగల సందర్భంగా షాపింగ్‌మాల్, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు సహాయ లేబర్ అధికారి నజీర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అందించడం లేదని వెల్లడించారు. వారికి ఓటీ ఇప్పించాలని కోరారు. అధ్యక్షుడు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు డిమాండ్

ముస్తాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో సీపీఐ నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముస్తాబాద్ మండలంలో పలు గ్రామాల్లో రెండు పడక గదుల నిర్మాణాలు చేపట్టినా అర్హులకు అందించలేదన్నారు. నాయకులు సోమనాగరాజు, రాజు, బాబు, భూమయ్య, రాములు, నాగరాజు, చంద్రం, రమేశ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పూర్తికి కృషి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట - లింగన్నపేట ప్రధాన రహదారిలో వాగులో నిర్మించిన మట్టిరోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచాయి. కలెక్టర్‌తోపాటు కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డిల ఆదేశం మేరకు గుత్తేదారు శనివారం పనులు పూర్తి చేయగా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ హైలెవల్ వంతెన త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి రాంచంద్రరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు, నాయకులు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి పాటుపడాలి

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట): వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు అన్నదాతల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గంలో గ్రామం నుంచి డైరెక్టర్‌గా ఎంపికైన కొంగరి కిష్టారెడ్డిని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలోని నాయకులు శనివారం ఘనంగా సన్మానించి మాట్లాడారు. నాయకులు దత్తాద్రిగౌడ్, నారాయణగౌడ్, సత్యం, శేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కోడెల మృతిపై ఆందోళన

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి తిప్పాపూర్ గోశాలలో కోడెలు మృతి చెందడం పట్ల భాజపా ఆధ్వర్యంలో నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. స్వామివారికి భక్తులు సమర్పించే నిజ కోడెలను తిప్పాపూర్‌లో ఆలయ గోశాలలో సంరక్షిస్తుంటారు. ఇటీవల కొన్ని కోడెలు అనారోగ్యంతో మృతి చెందడంతో భాజపా నాయకులు ఆందోళనకు దిగారు. వాటి సంరక్షణపై ఆలయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సరైన వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. పూర్తిస్థాయి పశు వైద్యుడిని నియమించడంతోపాటు సరైన పచ్చిమేత, గడ్డి, వసతులు, పరిశుభ్రమైన వాతావరణంలో సంరక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. భాజపా పట్టణ అధ్యక్షుడు రేగులు సంతోష్‌బాబు, నాయకులు హన్మాండ్లు, వివేక్‌రెడ్డి, రాజ్‌కుమార్, శేఖర్, లక్ష్మణ్, నరేశ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


గోశాల వద్ద ధర్నా చేస్తున్న భాజపా నాయకులు

‘ఉద్యోగ నియామకాల్లో అన్యాయం’

కోరుట్లపేట (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఉద్యోగ నియామకాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గ్రామశాఖ అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలను చేపడతామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి హామీని విస్మరించారన్నారు. హామీ అమలులో రెండు మాసాలుగా కాలయాపన చేస్తున్నారని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మాదిగలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీఎం వైఖరిని నిరసిస్తూ ఈ నెల 9న సిరిసిల్ల అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. నాయకులు శివశంకర్, సుమన్, అనిల్, వంశీ, రాములు, కిషన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కోనరావుపేట: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల భిక్షపతి అన్నారు. కోనరావుపేటలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రేవంత్‌రెడ్డి మాట తప్పి మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. మండల ఉపాధ్యక్షులు అక్కనపలి సురేశ్, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి జాన్, నాయకులు ముత్తం రాజు, కొమ్ము రాజశేఖర్, ప్రశాంత్, బొర్ర జోసెఫ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మాట్ల పోషయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెనక్కు తీసుకోవాలి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు మళ్లీ పరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కోరింది. గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నాయకులు నినాదాలు చేశారు. సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకుల రాజువీర్, హరీశ్, రాజు, దోశల శంకర్ నాయకులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాద నివారణ చర్యలేవి?

వెంకటాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి రగడు వరకు నిర్మించిన బైపాస్ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ యువకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైపాస్ రోడ్డుకు హెచ్చరికల సూచికలు, విద్యుత్తు దీపాలు లేకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ విషయాన్ని సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బైపాస్ రోడ్డులో సుమారు 600 మీటర్ల పొడవునా తారురోడ్డు వేయలేదని, దాని మూలంగా తప్పుడు మార్గంలో వాహనాలను నడపాల్సి వస్తుందని అన్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలతో రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరికలు, సూచికల బోర్డులు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు సన్నీ, చరణ్, పరశురాములు, వెంకటేశ్, నవీన్ ఉన్నారు.

ఆరోగ్య స్పృహతో ఆహార మార్పు

సంప్రదాయ పదార్థాలకు పెరిగిన ప్రాధాన్యం





రాగి జావ

ఆధునిక జీవనంలో అనారోగ్యాలతో సతమతమవుతున్న ఉమ్మడి జిల్లా వాసులు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. సంప్రదాయ ఆహారం మేలని రాగి, జొన్న, జావ, గటుక, చిరుధాన్యాలు, మొలకెత్తిన తృణ ధాన్యాలు వంటి వాటిని ఉదయం, సాయంత్రం ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వాటికి డిమాండ్ పెరుగగా, విక్రయ కేంద్రాలు కూడా వివిధ ప్రాంతాల్లో అందుబాటులోకి వస్తున్నాయి. ఉదయం అల్పాహారంగా వీటిని తీసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది..

న్యూస్‌టుడే- కరీంనగర్ విద్యావిభాగం

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని వయసుల వారు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తున్నారు.

☛ ఉదయం వేళ అల్పాహార స్థానంలో రాగి జావ, జొన్న గట్క, అలోవెరా, క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తదితరాలు తీసుకునేవారు పెరుగుతున్నారు. ఉదయపు నడక, వ్యాయామాలు పూర్తి చేసి ఈ ఆహారాన్ని ఆస్వాదిస్తున్నారు.


☛ రాత్రి వేళల్లో చాలా మందికి జొన్న రొట్టె ఇష్టమైన ఆహారంగా మారిపోయింది.

☛ అధిక బరువును తగ్గించేందుకు, శక్తికి, ఎముకల బలానికి, మధుమేహ నియంత్రణకు, కొవ్వును తగ్గించేందుకు ఈ ఆహారం దోహదపడుతుందని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన మైదానాలు, రహదారుల పక్కన ప్రత్యేకంగా వీటి విక్రయ కేంద్రాలు వివిధ వెలిశాయి. సుమారు రెండు వందల కేంద్రాలు ఉన్నట్లు విక్రయదారులు పేర్కొంటున్నారు.

☛ నిత్యం ఒక్కో కేంద్రంలో జావ, గటుక కోసం 150 మంది వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలుపుతున్నారు. వ్యాయామం చేసేవారే కాకుండా ఉద్యోగులు, గృహిణులు వీటిని తీసుకోవడం పెరుగుతోంది.

☛ మొలకెత్తిన తృణ ధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. దీంతో విక్రయాలు పెరుగుతున్నాయి.



గటుక



కరీంనగర్‌లోని ఓ రాగి జావ కేంద్రం వద్ద సందడి

చిరుధాన్యాలతో అల్పాహారం

నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావిస్తున్నవారు చిరుధాన్యాలతో చేస్తున్న అల్పాహారం వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల వారు వాటిని రుచికి తగ్గట్టుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొర్రల ఉప్మా, రాగులతో ఇడ్లీ, దోశ, ఉప్మా, మిల్లెట్ దోశ తదితరాలు తయారు చేస్తున్నారు. పీచు, కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వాటిల్లో ఎక్కువగా ఉండటం కొవ్వు శాతం తక్కువ కావడంతో మధుమేహం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారం తీసుకునేందుకు సుముఖత పెరిగింది.

విభిన్న రకాల జ్యూస్‌లు..

వివిధ రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. మునగాకు, బూడిద గుమ్మడి, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోధుమ గడ్డి, కలబందలతో జ్యూస్‌లు తయారు చేసి విక్రయించే కేంద్రాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. వీటిల్లో అధికపోషక విలువలు ఉండటం, ఉబకాయాన్ని, వివిధ రకాల రుగ్మతల నివారణకు ఇవి ఉపకరిస్తున్నాయని భావిస్తుండటంతో గిరాకీ పెరిగింది. 35 ఏళ్ల పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు నిత్యం వాటిని తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో 10 వరకు వాటి విక్రయ కేంద్రాలు ఉండగా, ఒక్కో కేంద్రంలో 50 నుంచి 80 గ్లాస్‌ల వరకు జ్యూస్‌లు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



కలబంద జ్యూస్

ఆస్తి కోసం దారుణ హత్య

తల్లిదండ్రులతో కలిసి అన్నను చంపిన తమ్ముడు



రాజు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆస్తి కోసం కన్నేసిన తమ్ముడు అన్నను అడ్డు తొలగించుకుంటేనే తాను భూమి పొందొచ్చని భావించాడు.. తల్లిదండ్రులు కూడా అతనికి సహకరించారు.. దీంతో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాజపల్లిలో శుక్రవారం రాత్రి నోముల రాజు (35)ను అయినవారే దారుణంగా హత్య చేశారని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజపల్లికి చెందిన నోముల చంద్రయ్య, ఎల్లమ్మ దంపతులకు నోముల రాజు (35), అంజి ఇద్దరు కుమారులు. అవివాహితుడైన రాజు స్థానికంగా ఉంటూ వృత్తి రీత్యా డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబానికి చెందిన మూడున్నర ఎకరాల పొలంలో వ్యవసాయ పనులు చూసుకునేవారు. అంజికి వివాహం కాగా, కొంతకాలం హైదరాబాద్‌లో కారు నడుపుకొంటూ జీవించాడు. కొద్ది రోజుల క్రితం హుజూరాబాద్‌కు వచ్చి ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేసిన అతను వ్యవసాయ భూమి తనకు ఇవ్వాలని రాజుతో ఇటీవల తరచూ గొడవకు దిగుతున్నాడు. రాజు ఒప్పుకోకపోయేసరికి కక్ష పెంచుకున్నాడు. రాజును హత్య చేస్తే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని భావించి తల్లిదండ్రులతో కలిసి కుట్ర పన్నాడు. శుక్రవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కర్రతో తలపై మోది చంపాడు. శనివారం తెల్లవారుజామున రాజు నిద్రలేవడం లేదని తల్లిదండ్రులు ఇరుగుపొరుగు వారిని పిలిచారు. మంచంపై అతను చనిపోయినట్లు కనిపించటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ తిరుమల్‌గౌడ్, ఎస్సై మహ్మద్ యూనుస్ అలీలు సంఘటన స్థలాన్ని పరిశీలించడంతోపాటు కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. విచారణలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు గుర్తించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. రాజును తమ్ముడు అంజి, తల్లిదండ్రులు చంద్రయ్య, ఎల్లమ్మలు కలిసి బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత్య చేసి ఉంటారనే అనుమానం ఉందని పంచాయతీ కార్యదర్శి కృపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంజి, రాజు తల్లిదండ్రులను విచారించగా కర్రతో కొట్టి చంపినట్లు వెల్లడించారని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు అంజి, చంద్రయ్య, ఎల్లమ్మలను శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

బావను హతమార్చి వరదకాలువలో పడేసిన బావమరింది

కోరుట్ల, న్యూస్‌టుడే: చెల్లె, కోడలుకు ఆపద పొంచి ఉందని భావించి బావను బావమరిదే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం బయటపడింది. కోరుట్లలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశం 2015లో కన్న కుమారుడిని హత్య చేయగా కోరుట్ల కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గతేడాది జైలు నుంచి విడుదలైన ఆయన భార్య లావణ్య, కూతురును వేధిస్తూ చంపుతానని బెదిరిస్తున్నాడు. చెల్లె, కోడలుకు అతనితో ఆపద ఉందని భావించి బావను హత్యచేయాలని భూషణ్‌రావుపేటకు చెందిన భూపతి గంగారాం నిర్ణయించుకున్నాడు. ఈ నెల 1న మల్లేశంకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకొని మద్యం తాగించాడు. అనంతరం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో విందు ఉందని చెప్పి అక్కడికి తీసుకెళ్లి మద్యం తాగారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చే క్రమంలో దుంపేట వరద కాలువ వద్ద మళ్లీ మద్యం తాగారు. మల్లేశం మద్యం మత్తులో ఉండగా గంగారాం బండరాయితో తలపై మోదడంతో పాటు వంతెన గోడకు బలంగా బాదాడు. మృతదేహాన్ని కాలువలో పడేసి వాహనాన్ని కిందపడేసి పరారయ్యాడు. వరద కాలువ వంతెన వద్ద మల్లేశం ద్విచక్ర వాహనం పడి ఉండడంతో పాటు కనిపించడం లేదని ఆయన సోదరుడు రాజమల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంగారాంపై అనుమానంతో 4న అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం, కారణాలను వెల్లడించారు. మృతదేహం మేడిపల్లి మండలం విలయతాబాద్ వద్ద లభించిందని, హత్యలో గంగారాంతో పాటు ఇంకెవరైనా పాలుపంచుకున్నారా అని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సీఐ సురేష్‌బాబు, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

తుది దశకు డీఎస్సీ-2008 ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీల నియామకాలకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ 2008 బాధిత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తుది దశకు చేరుకుంది. జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలోని 186 మంది జాబితాలను ప్రకటించింది. జాబితాలో పేర్లు ఉన్న వారిలో చాలామంది వేర్వేరు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు రాలేదు. ఆదివారం కూడా ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారులు తెలిపారు.



డీఈవో కార్యాలయం ముందు జాబితాలో పేర్లు లేని అభ్యర్థులు

96 మంది మాత్రమే హాజరు..

జిల్లా విద్యాశాఖ గత నెల 27 నుంచి శనివారం వరకు నిర్వహింతచిన ధ్రువీకరణపత్రాల పరిశీలనకు మొత్తం 96 మంది అభ్యర్థులు హాజరైనట్లు సంబంధిత అధికారులు చెప్పారు. మిగిలిన 90 మంది అభ్యర్థులు హాజరుకాకపోవడం అధికారులను విస్తుగొలుపుతోంది. పదో తరగతి మార్కుల మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు వారి వద్ద లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పరిశీలనకు హాజరుకాలేని పలువురు డూప్లికేట్ మార్కుల మెమో కోసం రాష్ట్ర విద్యాశాఖకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద మెమోల కోసం నిరీక్షిస్తున్నారని కొందరు తెలిపారు. వీరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంలో అధికారులు సానుకూలంగా ఉన్నారు.

తమకూ న్యాయం చేయాలి

ధ్రువీకరణపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జాబితాలో అర్హులైన తమ పేర్లు లేవని, తమకు న్యాయం చేయాలని 8 మంది (పాత మెరిట్ జాబితాలో ఉన్నవారు) ఆందోళన వ్యక్తం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు ఈ విషయంలో చొరవ చూపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఛాంపియన్‌గా కరీంనగర్ క్రికెట్ జట్టు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు ఛాంపియన్స్‌గా నిలిచింది. శనివారం తుది పోరులో కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు సాధించింది. కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. విగ్నేష్ 53 (నాటౌట్), కమ్రాన్ 50, రిత్విక్ 29 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా విగ్నేష్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఆగంరావు, ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్, విద్యాసాగర్‌రావులు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.



బహుమతి అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు